క్లుప్తంగా

నేడు అంకాలమ్మ తల్లికి బోనాలు

మైదుకూరు : మైదుకూరులో గ్రామ దేవత అంకాలమ్మ తల్లికి ఆదివారం బోనాలను సమర్పించి మొక్కుబడులను చెల్లించనున్నారు. తిరునాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద ఆర్చీ, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ప్రత్యేక పూజలు, సుడిబండి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. సోమవారం వృషభరాజములకు బండ లాగుడు పోటీలను నిర్వహిస్తారు.

రాత్రికి రాత్రే వెలసిన ఆంజనేయస్వామి విగ్రహం


ఆంజనేయస్వామి విగ్రహం

మైదుకూరు : స్థానిక నంద్యాల రోడ్డులో ఉన్న మున్సిపాలిటీ స్థలంలో రాత్రికి రాత్రే ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నంద్యాల రోడ్డులో మున్సిపాలిటీ బోర్వెల్ ఉన్న చోట ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఎవరో ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో ఉండే మహిళలు విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్


ప్రొద్దుటూరు కల్చరల్ : రన్ ఫర్ జీసస్‌లో క్రైస్తవులు, విశ్వాసులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు ఐక్య క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రన్ ఫర్ జీసస్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. స్థానిక రామేశ్వరంలోని మోరీల వద్ద రన్ ఫర్ జీసస్ ర్యాలీని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ ర్యాలీ రామేశ్వరం, గాంధీ రోడ్డు, టీబీ రోడ్డు, శివాలయం మీదుగా ఎస్‌పీజీ–1 చర్చి వరకు సాగింది. క్రైస్తవులు, విశ్వాసులు ఉత్సాహంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. క్రీస్తు పునరుత్థానం వేడుకల్లో భాగంగా ఈ ర్యాలీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని చర్చిల పాస్టర్లు, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలను అందిస్తాం


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీవాణి

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో అందరి సహకారంతో మెరుగైన వైద్య సేవలను అందిస్తామని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీవాణి తెలిపారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్న ఆమె శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. హాస్పిటల్‌లో ఒక గైనకాలజి మాత్రమే ఉన్నారన్నారు. అవసరమైతే తాను కూడా ప్రసూతి విభాగంలో సేవలు అందిస్తానన్నారు. శానిటేషన్‌పై దృష్టి సారిస్తానని తెలిపారు. వైద్యులు, ఇతర విభాగాల సిబ్బంది సహకారంతో మంచి వైద్యం అందించడానికి కృషి చేస్తానని సూపరింటెండెంట్ తెలిపారు.

స్కౌట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు


సర్టిఫికెట్లను అందుకున్న స్కౌట్ విద్యార్థులు

మైదుకూరు : స్కౌట్ల పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మైదుకూరు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులకు శనివారం పాఠశాలలో సర్టిఫికెట్లను అందజేశారు. కడప శంకరాపురంలోని స్కౌట్ హాల్‌లో జరిగిన తృతీయ స్కౌట్ టెస్టింగ్ క్యాంప్‌లో పాఠశాల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు స్కౌట్ మాస్టర్ సురేంద్ర నాయక్, పీడీ చంద్రావతి తెలిపారు. ఈ విద్యార్థులను హెడ్మాస్టర్ రామమోహన్, ఉపాధ్యాయులు, ఎల్.సూర్యనారాయణ రెడ్డి, ఎ.శ్రీనివాసులు అభినందించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ వద్ద ఉన్న మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(మను) పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విలయత్ అలీ బేగ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన అడ్మిషన్ పోస్టర్లను శనివారం సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మను పాలిటెక్నిక్ కళాశాలలో మే 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ ఉంటాయని, ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించి ప్రవేశ పరీక్ష జూన్ 13వ తేదీ మధ్యాహ్నం కడపలోని మను కళాశాల క్యాంపస్‌లో ఉంటుందని తెలిపారు. ర్యాంకు ద్వారా సీట్లు భర్తీ చేస్తారని చెప్పారు. వివరాలకు అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ సికందర్ హుస్సేన్ 93980 83058 ను సంప్రదించాలన్నారు.

పాలకా.. మా వైపు చూడరూ..

మీ అవసరాల కోసం ఏడు దశాబ్దాల కిందట మాకు ప్రాణం పోశారు. అంతే ఇప్పటి వరకూ మా వైపు కన్నెత్తి చూసిన పాపాణ పోలేదు. మీకేనా జబ్బులు వచ్చేది. మాకు రావా..! ముక్కు కారిందంటే పరిగెత్తుకుంటూ ఆసుపత్రికి పోతారే.. మరి నిరంతరం మీకు సేవ చేస్తున్న మాకు ముక్కు నొచ్చినా కాళ్లు నొచ్చినా ఏనాడు మా వైపు కన్నెత్తిచూడలేదు. మాబాధలు మేం పడుతూ నిత్యం మీకు సేవ చేస్తున్నాం. అయినా మీకు మాపై కనికరం లేదు. ఒకవేళ మీ భారాన్ని మేం మోయలేక కూలిపోతే నష్టపోయేది మీరేనని ఏ నాడైనా అను కున్నారా.. అంటూ సగిలేరు నదిపై నిత్యం సేవలందిస్తున్న నాలుగు వంతెనల ఆవేదనకు సంబంధించిన కథనం ఇది.

- మా ఆరోగ్యం బాగా లేదు.. మాకు నయం చేయించండి
- మాకు వయస్సు పెరిగేకొద్దీ.. భారం ఎక్కువవుతోంది
- సగిలేరు నదిపై ఉన్న నాలుగు వంతెనల మనోవేదన


కూలేందుకు సిద్ధంగా కలసపాడు వద్ద సగిలేరు నదిపై ఉన్న వంతెన


గుంతలమయమైన బయనపల్లె వద్ద ఉన్న సగిలేరు నదిపై ఉన్న వంతెన

బద్వేలు : మాపై నిత్యం రద్దీ పెరుగుతోంది. మేం వయస్సులో ఉన్నప్పుడు పెద్దగా రద్దీ ఉండేది కాదు. మా వయస్సు పెరిగే కొద్దీ రద్దీ పెరిగింది. రోజులో ఏదో సమయంలో రద్దీ స్తంభించినప్పుడు నాపై ఆ భారం మరింత పడుతోంది. ఇప్పటికే మాలో సత్తువ సన్నగిల్లుతోంది. నన్ను(కలసపాడు వంతెన)70 ఏళ్ల కిందట నిర్మించారు. మిగిలిన మా తమ్ముల వయస్సు (వంకమర్రి, నందిపల్లె, బయనపల్లె వంతెనలు) ఓ పదేళ్లు తక్కువ ఉంటుంది. నాపై భారం అంతగా లేక పోయినా మిగిలిన ముగ్గురిపై భారం అధికమైంది. మాపై నుంచి రోజులో వందలాది వాహనాలు వెళ్లుతుంటాయి. ఫుట్‌పాత్‌లు శిథిలమై పెద్దపెద్ద రంధ్రాలు పడ్డాయి. రంధ్రాల్లోంచి కింద పారుతున్న సగిలేరు నదిలోని నీరు కన్పిస్తుంది. పాదాచారులు నాపై నడిచి వెళ్ల లేని పరిస్థితి ఎప్పటి నుంచో దూరమైంది. ఇలా మాలో సత్తువ తగ్గుతున్నా నిటారుగా నిలబడి రద్దీ భారాన్ని మోస్తూనే ఉన్నాం. ఉన్న కొద్దీపాటి సత్తువతో అలానే సేవలు అందిస్తున్నాం. కలసపాడు పట్టణానికి ప్రవేశద్వారమైన సగిలేరునదిపై ఉన్న వంతెన మరియు వంకమర్రి, నందిపల్లె, బయనపల్లె దగ్గర సగిలేరుపై ఉన్న వంతెనల బాధలు అధికారులకు, ప్రజలకు ఏకరువు పెట్టుకుంటున్న వైనం.

అన్ని వాహనాలు మాపై నుంచే..

హైదరాబాద్, కర్నూలు, కడప, నెల్లూరు, అనంతపురం, తిరుపతి, విజయవాడ, శ్రీశైలం, బెంగళూరు వంటి పట్టణాలకు, నగరాలకు, పల్లెలకు వెళ్లే అన్ని రకాల వాహనాలు మాపై వెళ్తుంటాయి. దీంతో సత్తువ తగ్గుతున్న మేము రద్దీ ఒత్తిడితో అలసి సొలసి పోతున్నాం. మాలో ఇద్దరం మాత్రం బద్వేలు పట్టణానికి దగ్గరగా పడమర, దక్షిణ దిశల్లో ఉన్నాం. మాపై నుండి రోజూ చాలా పట్టణాలకు, నగరాలకు వేలాది వాహనాలు రాకపోకలు జరుపుతుంటాయి.

బాగుచేయండి.. లేదా ప్రత్యామ్నాయం చూసుకోండి

శిథిలావస్థకు చేరుకుంటున్న మమ్ములను బాగుచేయండి లేదా నన్ను వద్దనుకుంటే మా పక్కనే ప్రత్యామ్నాయంగా మరిన్ని వంతెనలు నిర్మించుకోండి. అప్పుడు మాపై ఒత్తిడి తగ్గి కొంత కాలం మీకు సేవలు అందించే భాగ్యం మాకు కలుగుతుంది. కలసపాడు, బయనపల్లె, వంకమర్రి వద్ద నూతన వంతెనలకు మాస్టర్‌ప్లాన్ తయారవుతుందని తెలిసి మాకు మంచి రోజులు వస్తున్నాయని ఆశ పడుతున్నాం. అయితే అంతకంటే ముందుగా అత్యవసరంగా మాకు మరమ్మతులు చేస్తే ఇంకొంత కాలం మేము మీ సేవలో ఉంటాం. అలా కాకుండా నిర్లక్ష్యంగా వది లేస్తే ఏదో ఒకరోజూ మా సత్తువ పూర్తిగా తగ్గిపోతుంది. ఆ రోజూ సేవలకు సెలవంటూ నేను కూలిపోతే జరిగే కష్ట నష్టానికి మాత్రం మమ్ములను బాధ్యులను చేయకండి. మీ అందరికీ చేతులెత్తి మొక్కు తున్నాం అంటూ బద్వేలు నియోజకవర్గ పాలక పక్ష నేతలను, అధికారులను వంతెనలు వేడుకుంటున్నాయి.

అండగా ఉంటామన్న ఎమ్మెల్సీ


బాదుల్లాను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కుడికాలు కోల్పోయిన గొడుగు బాదుల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇంటికి వచ్చాడన్న సమాచారంతో శనివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి బాదుల్లాను పరామర్శించారు. పుల్లివీడుకు చెందిన బాదుల్లా(30) గత ప్రభుత్వంలో వలంటీర్‌గా పనిచేస్తూ అందరితో మంచి పేరు తెచ్చుకున్నాడు. భార్య, ఇద్దరు రెండేండ్ల లోపున్న కుమార్తెలు, తల్లి ఉన్నారు. ప్రభుత్వం మారడంతో వ్యవసాయపనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. చిన్న వయసులో కాలు కోల్పోయి, జీవనానికి ఇబ్బంది కరంగా పరిస్థితి తయారయిందని, ఆసుపత్రి నుండి ఇంటికి వచ్చేసరికి రూ.9 లక్షలు ఖర్చయిందని బాదుల్లా ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి చెప్పుకున్నాడు. పార్టీ తరపున ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. మీ కుటుంబానికి అండగా ఉంటామని బాదుల్లాకు ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ వెంట రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, నియోజకవర్గ బూతు కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, పార్టీ నాయకులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజుపాళెం : మండలంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 2025–26 సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రమణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో స్వయం ఉపాధి కల్పించడం కోసం సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయం చేసేందుకు ఏప్రిల్ 11వ తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానించామని.. అర్హత కలిగిన వారంతా మెడికల్ షాప్, మెడికల్ ల్యాబ్ ఎలక్ట్రిక్ బ్యాటరీ చార్జింగ్ యూనిట్, ఎలక్ట్రిక్ ఆటో, పాసింజర్ కార్, గూడ్స్‌ట్రక్ తదితర యూనిట్లకు రుణాలు ఉన్నాయని, వాటికోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఖాదర్‌పల్లెలో నాకాబందీ


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లె గ్రామంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8గంటల వరకూ పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, చాపాడు పోలీసు స్టేషన్ ట్రైనీ డీఎస్పీ భవానీలతో పాటు సబ్ డివిజన్ పరిధిలోని అందరూ సీఐలు, ఎస్ఐలతో పాటు 130 మంది పోలీసు సిబ్బందితో ఖాదర్‌పల్లె గ్రామంలో సోదాలు నిర్వహించారు. అనుమానిత ఇళ్లతో కల్లాలు, వరండాలు, పశువుల పాకల ఇలా అనుమానం కలిగిన ప్రతి చోటా తనిఖీలు చేశారు. ఎవరైనా ఇళ్లలో మారణాయుధాలు ఇంటే స్వచ్ఛందంగా పోలీసులకు అందజేయాలని లేకుంటే చట్టపరమైన శిక్షకు కారకులవుతారన్నారు. ఖాదర్‌పల్లె గ్రామంలో ప్రజలు ఎవరూ భయాందోళనకు చెందవద్దని ఎలాంటి ఇబ్బందులు కలిగిన వెంటనే పోలీసులను సంప్రదించాలని డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ గ్రామ ప్రజలకు సూచించారు. మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ రక్షణ సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

వెదురూరులో ఉచిత పశు వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో శనివారం ప్రొద్దుటూరు మండలం గోపవరం వద్ద గల పశు వైద్య కళాశాల విద్యార్థుల ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పశువులకు గర్భకోశ వ్యాధులు, మందగూబ ఇతర సమస్యలు కలిగిన పశువులకు శస్త్ర చికిత్స చేయడంతో పాటు సాధారణ జబ్బులకు వైద్యం చేశారు. పశువులు, జీవాలకు నట్టల నివారణ మందులను త్రాపించారు. మినరల్ మిక్చర్, ఎముకల పొడిని పాడి రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య కళాశాల అధికారులు డా.ఇందిర. డా.వాణి, అధ్యాపకులు డా.సుమిరన్, డా.భార్గవి, డా.విజయకుమార్, డా.రాయల్‌రెడ్డి, డా.శ్రీవాణి, పశు వైద్యులు సుదర్శన్‌రెడ్డి, ఎస్ఏ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై ముక్తిరామలింగేశ్వరస్వామి


గజ వాహనంపై గంగా రాజరాజేశ్వరి సమేత ముక్తి రామలింగేశ్వర స్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున సైకత లింగానికి, రాజరాజేశ్వరి దేవికి విశేష పూజలు చేశారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గజ వాహనంపై కొలువు దీర్చారు. పురవీధుల్లో శివనామస్మరణల మధ్య వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు.

నేడు రథోత్సవం..

ముక్తిరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు స్వామి వారి రథోత్సవం ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని, భక్తులు పాల్గొనాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చైత్రమాసం మూడవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం పలు రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : బూత్ లెవల్ అధికారులు అర్హత ఉన్న ప్రతిఒక్కరికి ఓటుహక్కు కల్పించేందుకు కృషి చేయాలని ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని సభా భవనంలో బద్వేలు, గోపవరం, బి.కోడూరు, అట్లూరు మండలాలకు సంబంధించిన బూత్ లెవల్ అధికారులకు, సూపర్‌వైజర్లకు ఎన్నికల విధులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్ళి అర్హత ఉన్న 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించడంతో పాటు ఏదైనా కారణాల చేత మృతిచెందిన వారి ఓట్లను జాబితా నుండి తొలగించాలని కోరారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఫారం–6(ఎ) ఫారం–7, ఫారం–8 అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నలక్ష్మి, ఆయా మండలాల ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత


మంటల్లో చిక్కుకున్న రోగులను ఎలా బయటకు తీసుకురావాలో వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బద్వేలు అర్బన్ : అగ్నిప్రమాదాల నివారణలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని బద్వేలు ఫైర్ ఆఫీసర్ ఎం.చంద్రుడు తెలిపారు. శనివారం స్థానిక సిద్దవటం రోడ్డులోని పద్మావతి హాస్పిటల్‌లో సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అత్యవసర సమయాల్లో ఊపిరి సరిగా ఆడనప్పుడు, గుండె ఆగినప్పుడు సీపీఆర్ ఏవిధంగా చేయాలి, బహుళ అంతస్థు భవనాలలో మంటల్లో చిక్కుకున్న వృద్ధులను, పేషెంట్లను ఎలా కాపాడాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అలాగే బహుళ అంతస్థుల భవనంలో మంటలు ఆర్పే విధానం, సీఓటు, డీసీపీ యంత్రాలను ఉపయోగించే విధానాన్ని, గ్యాస్ లీకేజీ మంటలను ఆర్పే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించడంతో పాటు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులకు, సిబ్బందికి శనివారం అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక అధికారి నజీర్ అహమ్మద్ అవగాహన కల్పించారు. ప్రమాదంలో రోగులను ఎలా కాపాడాలో ప్రదర్శించి చూపారు. కార్యక్రమంలో ఆసుపత్రి అధికారి వెంకటనాగేంద్ర, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల్లో అప్రమత్తత అవసరం

మైదుకూరు : అగ్ని ప్రమాదాల్లో అప్రమత్తతతో వ్యవహరించడం వల్ల తీవ్రంగా నష్టపోకుండా చూడవచ్చని మైదుకూరు అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి బి.సత్యరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం మైదుకూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం, హెచ్‌సీసీ ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా సురక్షితంగా బయటకు రావాలి, అగ్నిమాపక పరికరాలు ఎలా వాడాలి అనే విషయాన్ని అగ్నిమాపక సిబ్బంది సీహెచ్‌సీలో వివరించారు. రెస్క్యూ మెథడ్స్, అత్యవసర సమయంలో ఊపిరి సరిగ్గా లేనప్పుడు, గుండె ఆగినప్పుడు సీపీఆర్ ప్రయోగపూర్వకంగా చేసి సిబ్బందికి వివరించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

బద్వేలు అర్బన్ : పరిసరాల పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని బద్వేలు ఆర్డీఓ కె.చంద్రమోహన్ తెలిపారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ శాఖల అధికారులు, హైస్కూల్ విద్యార్థులతో కలిసి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని, ఇందుకోసం పట్టణ స్వచ్ఛతకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని ప్రజలు పూర్తిగా నిషేధించాలని కోరారు. అలాగే ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సంబంధిత పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని, వారు వాటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్వీర్యం చేస్తారని, తద్వారా వాతావరణ కాలుష్యం సంభవించదని తెలిపారు. అలాగే ప్రతిఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి, అర్బన్ ఎస్ఐ–2 జయరామిరెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.వి.సుబ్బారెడ్డి, కౌన్సిలర్ సునీత, ఆయాశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్తా చెదారాలను తొలగించారు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా ప్రిన్సిపాల్ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల ఆవరణలోని చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేశారు. అలాగే అటవీశాఖ కార్యాలయంలో రేంజర్ రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కార్యాలయ ఆవరణ శుభ్రం చేశారు. అలాగే స్థానిక 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఏఈఈ వెంకటమహేష్ ఆధ్వర్యంలో సిబ్బంది పరిసరాలు శుభ్రం చేశారు.

హాస్పిటల్స్‌లో పరిశుభ్రత పాటించాలి

ప్రొద్దుటూరు క్రైం : హాస్పిటల్స్‌లో పరిశుభ్రతను పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీరాములపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో పనికిరాని ఎలక్ట్రికల్ వస్తువులను తొలగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి నెలా మూడవ శనివారం 'స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా ప్రతి నెలా ఒక థీమ్ ఇస్తారని చెప్పారు. ఈ నెలకు సంబంధించి ఆస్పత్రిలో ఉన్న పనికి రాని ఎలక్ట్రానిక్ వస్తువులను తొలగించాలని తెలిపారు. ఇళ్లలో ఉన్న ఎలక్ట్రిక్ వస్తువులను పరిశీలించి, వాటిలో పనికి రానివి ఉంటే బయట పడేయాలని సూచించారు. ఆస్పత్రిలో అన్ని విభాగాలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.

టీబీరోడ్డు అర్బన్ హెల్త్ సెంటర్‌లో..

టీబీరోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం డాక్టర్ హిమబిందు స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలోని పనికి రాని ఎలక్ట్రానిక్ వస్తువులను తీసేశారు.

ఈ–వేస్ట్‌పై అవగాహన

ప్రొద్దుటూరు : స్థానిక టీబీ రోడ్డులోని అన్న క్యాంటిన్ వద్ద స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ–వేస్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం ప్రభుత్వం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈ–వేస్ట్‌పై ప్రత్యేక కార్యక్రమం చేపట్టామన్నారు. మన ఇళ్లల్లో ఉన్న పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువుల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. ఫ్రిడ్జ్‌లు, టీవీలు, ఎల్ఈడీ బల్బులు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, చార్జర్లు తదితర పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇందు కోసం పట్టణంలోని అన్న క్యాంటిన్, శివాలయం సర్కిల్, గాంధీ పార్కు వద్ద కియోస్క్ డబ్బాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక టన్ను ఈ- వేస్ట్‌ను సేకరించామని తెలిపారు. ప్రాసెసింగ్ ఏజెన్సీ ద్వారా సేకరించిన ఈ వ్యర్థాలను సైంటిఫిక్‌గా డిస్పోజబుల్ చేస్తారన్నారు. అనంతరం పరిశుభ్రతపై అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్ బాషా, సుబ్బరాయుడు, శానిటరీ సెక్రటరీలు శ్రీనివాసులరెడ్డి, శివకరుణ శ్రీ పాల్గొన్నారు.

ఈ–వేస్ట్ పరికరాలకు గ్రీన్ అంబాసీడర్లకు అందజేయాలి

చాపాడు : ప్రతి ఇంటిలో ఉంటే ఎలక్ట్రానిక్ వేస్ట్ పరికరాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా గ్రీన్ అంబాసీడర్లకు అందజేయాలని ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మూడో శనివారం ఈ–వేస్ట్ పరికరాలను పారేయడంపై విద్యార్థులతో పాటు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పనికిరాని ఎలక్ట్రానిక్ పరికరాల ప్రదర్శన నిర్వహించి వాటిని ఎక్కడ పడితే అక్కడ పడేయరాదని, ప్రతి రోజూ ఇళ్ల వద్దకు వచ్చి చెత్తను తీసుకెళ్లే గ్రీన్ అంబాసీడర్లకు అందజేయాలని ఈఓపీఆర్డీ సూచించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ఉద్దేశించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రామానుజం, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జానకిరామ్, వెలుగు ఏపీఎం శ్రీధర్, గ్రామ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛతే లక్ష్యమని ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ చంద్రమోహన్, అధికారులు


దువ్వూరు : పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున


ఈ-వేస్ట్ పరికరాలు అందిజేస్తున్న ఎంపీపీ

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

దువ్వూరు : వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రజలందరూ కృషి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణయ్య తెలిపారు. శనివారం స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులతో కలసి దువ్వూరు ఎంపీడీఓ కార్యాలయం నుండి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం మండలంలోని ఒక పంచాయతీలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం పరిశుభ్రతపై విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు సర్పంచ్ చెంద్రాయుడు, ఈఓపీఆర్డీ హరికృష్ణ, హౌసింగ్ డీఈ రమేష్ బాబు, ఎంఈఓ భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌజన్య, వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, మండల ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

బ్రహ్మంగారిమఠం : ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ సి.వీరనారాయణ రెడ్డి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయం శనివారం ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఈ వేస్ట్ మిషన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఎంపీడీఓ మల్లికార్జున, పాలరామిరెడ్డి, జోగయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్ : ఇళ్లల్లో మిగిలిపోయే ఎల్రక్టానిక్ వ్యర్థపదార్థాలు విష పదార్థాలతో సమానమని, వీటిని చిన్న పిల్లలకు దూరంగా ఉంచాలని డీపీఓ రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని కొత్తపల్లె, గోపవరం గ్రామ పంచాయతీల్లో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ–వేస్ట్‌పై ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి, డీపీఓ కార్యాలయ ఏఓ ఖాదర్‌బాషా, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, గోపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ


కొల్లిబోయిన మునిసాయి యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభకనబరిచారు. స్థానిక టూటౌన్ బైపాస్ రోడ్డులోని శ్రీశివసాయి టైల్స్ అండ్ గ్రైనైట్స్ వ్యాపారి కొల్లిబోయిన మునెయ్య కుమారుడు మునిసాయి యాదవ్ 99.99 పర్సంటైల్ సాధించాడు. ఆల్ ఇండియా స్థాయి ఓపెన్ కేటగిరిలో 43వ ర్యాంక్ సాధించగా, ఓబీసీ విభాగంలో జాతీయ స్థాయిలో ఐదవ ర్యాంక్ సాధించాడు.


చైతన్య కుమార్‌ను అభినందిస్తున్న అభ్యాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరెడ్డి

- స్థానిక అభ్యాస్ జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.చైతన్యకుమార్ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 98.42 పర్సంటైల్ సాధించాడు. అలాగే జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు 16 మంది ఎంపికయ్యారు. వీరిని కరస్పాండెంట్ బచ్చల వీరప్రతాప్, ప్రిన్సిపాల్ జగదీశ్వరరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ప్రారంభమైన దేవర

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కానపల్లె గ్రామంలో ఆదివారం పెద్దమ్మతల్లి దేవర ఉత్సవం ఘనంగా నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. మూడేళ్లకో మారు ఆనవాయితీగా గ్రామస్తులు ఈ ఉత్సవాన్ని నిర్వహించుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇంటింటా చలువ పందిళ్లు వేశారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పెద్దమ్మతల్లిని మట్టితో తయారు చేసిన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆదివారం పెద్దమ్మకు భక్తులు బోనాలు సమర్పించనున్నారు.